క్లుప్తంగా

ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి

చీరాల టౌన్: గ్రామాల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.నేతాజీ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయితీల కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారి ఆదేశాలతో పంచాయితీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. పన్ను వసూళ్లలో అలసత్వం వలన గ్రామ పంచాయతీల్లో పలు సమస్యలు వేధిస్తున్నాయన్నారు. డిసెంబర్ 20 తేదీలోపు పన్ను వసూళ్ల వందశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా వాటర్ ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లు మరమ్మతులు చేయించి మంచినీరు ప్రజలకు అందించాలన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోండి

బల్లికురవ: జగనన్న కాలనీ 14 లేఅవుట్‌లలో గృహనిర్మాణాలు పూర్తి చేసుకున్న 95 మందికి ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని గృహనిర్మాణ సంస్థ ఏఈ దుర్గా రమేష్ అన్నారు. ఒక్కో ఇంకుడు గుంతకు రూ. 6 వేలు అందజేస్తారని చెప్పారు. ఇంటి పట్టా, ఆధార్, జెరాక్స్‌తో విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ సబ్ ఇంజినీర్ వేదవ్యాస్ తెలిపారు. పోల్స్, లైట్లు ఏర్పాటు చేస్తామని వివరించారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



ఎస్‌ఐ రవిశంకర్ రెడ్డి

పర్చూరు (చినగంజాం): పర్చూరులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చేస్తానని పర్చూరు ఎస్‌ఐగా నియమితులైన వి. రవిశంకర్ రెడ్డి అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. బొమ్మల సెంటర్‌లో ప్రతి రోజూ పోలీసులు విధుల్లో ఉంటారని తెలిపారు. పేకాట, క్రికెట్ బెట్టింగ్, కోడి పందేలు, గంజాయి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీఎంఈజీపీకి దరఖాస్తు చేసుకోండి

బల్లికురవ: ప్రభుత్వం రైతులకు సబ్సీడిపై పీఎంఈజీపీ పథకంలో గేదెలు, అవుల కోనుతోలు యూనిట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి పి. మహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు 35 శాతం సబ్సిడీ, 5 శాతం రైతు వాటా, 65 శాతం బ్యాంక్ వడ్డీతో రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలవరకు రుణం పొందవచ్చన్నారు. ఇతరులకు 25 శాతం సబ్సిడీ, 10 శాతం రైతు వాటా, 65 శాతం బ్యాంకు నుంచి రుణం పొందవచ్చన్నారు.

ఐక్యతతో ప్రశాంత జీవనం




చెన్నుపల్లిలో మాట్లాడుతున్న సంతమాగులూరు సీఐ ప్రభాకర్

బల్లికురవ: ప్రజలు కక్షలు వీడి ప్రశాంతంగా జీవించాలని సంతమాగులూరు సీఐ ప్రభాకర్ కోరారు. గ్రామ దర్శినిలో భాగంగా బుధవారం రాత్రి చెన్నుపల్లి గ్రామస్తులతో మాట్లాడారు. ఐక్యతతో సాధించలేనిది ఏమీ లేదని, పోలీస్‌శాఖ తమ వంతు సహకారం అందిస్తుందని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు రావటం వల్ల ఎంతో సమయం, డబ్బు వృథా అవుతుందని సీఐ వివరించారు. ఎస్సై వి. వేమన పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటిలోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

చీరాల టౌన్: ప్రతినెలా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందిస్తున్న వైఎస్సార్ భరోసా పింఛన్ల పంపిణీని గురువారం పూర్తి చేయాలని ఎంపీడీవో నేతాజీ ఆదేశించారు. బుధవారం మండలంలోని బుర్లవారిపాలెం, సాయికాలనీ, దేవాంగపురి గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటికీ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో పరిశీలించారు. పదిహేను పంచాయతీల్లో ఉన్న 10595 వివిధ రకాల పింఛన్లలో 8500 వరకు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారన్నారు.

ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తికి పెన్షన్



అందుకుంటున్న లబ్ధిదారుడు వెంకయ్య

యద్దనపూడి: గుండె ఆపరేషన్ చేయించుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి ఓ వలంటీర్ ఒకటో తేదీనే పెన్షన్ అందించి తన సేవా గుణాన్ని చాటుకుంది. గన్నవరం గ్రామానికి చెందిన పెన్షన్ లబ్ధిదారుడు పల్లెపోగు వెంకయ్య ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. ప్రస్తుతం చిలకలూరి పేటలోని కొమ్మినేని నర్సింగ్ హోంలో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా గుండెకు స్టంట్ ఆపరేషన్ చేయించుకొని ఉన్నాడు. ఒకటో తారీఖు రావడం పెన్షన్ సమయం కావడంతో గన్నవరం సచివాలయానికి చెందిన వలంటీర్ పల్లెపోగు దివ్యతేజ చిలకలూరిపేట ఆస్పత్రికి వెళ్లి వెంకయ్యకు పింఛను అందించింది.



జె. పంగులూరు: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీడీవో, సిబ్బంది



చీరాల: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు పోతుల సురేష్, తదితరులు



చీరాల: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్, డీటీ



కొరిశపాడులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

‘అమరజీవి’స్ఫూర్తి మరువలేనిది

- ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం

చీరాల: ‘అమరజీవి’ పొట్టి శ్రీరాములు స్ఫూర్తి మరువలేనిదని పలువురు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కామధేను కాంప్లెక్సు వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు పోతుల సురేష్ అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం కోసం 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు విడిచిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. అటువంటి వ్యక్తి తెలుగు ప్రజలకే కాకుండా దేశానికి కూడా మార్గదర్శి అని అన్నారు. పార్టీ నాయకులు మల్లెల బుల్లిబాబు, అవ్వారు మోహనరావు, గుమ్మడి ప్రకాష్, దామిశెట్టి శ్రీనివాసరావు, శ్రీను, అంకిరెడ్డి, దామర్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగఫలం మరువలేనిది

చీరాల అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలంతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని, ఆయనను స్మరించుకోవడం అందరి కర్తవ్యమని రిటైర్డు బ్యాంకు మేనేజర్ జి.హరిప్రసాద్ అన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శాఖ గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతిపిత మహాత్మా గాంధీలు దేశానికి ఆదర్శమైతే పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా ఆంధ్రరాష్ట్ర అవతరించిందన్నారు. వివేకానంద సేవా సమితి అధ్యక్షులు సర్విశెట్టి సుబ్బరామయ్య, గ్రంథపాలకురాలు డి.ధనమ్మ తదితరులు పాల్గొన్నారు. గుర్రం రాఘవరావు, వేముల చంద్రశేఖర్, కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ, శీరాం వేణుగోపాల్, చిన్ని లీలాధరరావు, కోట శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు

అద్దంకి: ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ దీక్షతో ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఆయన బుధవారం పట్టణంలోని పాత బస్టాండు సెంటరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. చైతన్య మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రంతో కలిసి ఉన్న సమయంలో తెలుగు ప్రజలు భాషాపరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఆ సమయంలో ఆంధ్ర రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేయగా ఆయన మరణానంతరం ఆంధ్ర రాష్ట్రం వచ్చిందని చెప్పారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, నాయకుడు సందిరెడ్డి రమేష్, ఆర్యవైశ్యులు, పట్టణ నాయకులు, మునిసిపల్ వైస్ చైర్మన్ దేశు పద్మేష్, మునిసిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న చైతన్య

చీరాల టౌన్: దేశాన్ని బ్రిటీష్ కబంధ హస్తాల నుంచి విముక్తి కలిగించి తమ ప్రాణాలను పణంగా పెట్టిన మహనీయుల త్యాగాలు, పోరాటాలను మరవకూడదని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పొట్టిశ్రీరాములు చిత్రపటాలకు నివాళులర్పించారు. టీడీ పీకా సురేష్‌బాబు, రీ సర్వే డీటీ దేవతోటి అర్జున్, ఆర్ఐ శేఖర్, వీఆర్వోలు కళ్యాణ్, వీరాస్వామి, కృష్ణారెడ్డి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

కారంచేడు: మండలంలోని కారంచేడు, స్వర్ణ, దగ్గుబాడు మోయిన్, ఆదిపూడి మోయిన్, యర్రంవారిపాలెం, తిమిడెదపాడు, కుంకలమర్రు మోయిన్ ప్రాథమిక పాఠశాలలో నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అమరజీవి త్యాగాలను గుర్తుచేసుకోవాలన్నారు. పావులూరి శ్రీనివాసరావు, రావి పద్మావతి, శోభాదేవి, భవనం శ్రీనివాసరెడ్డి, రేణుక, జి. రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

మేదరమెట్ల: ఆంధ్రరాష్ట్ర అవతరణ పురస్కరించుకొని ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టి దీక్ష చేసి రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి కొరిశపాడు మండల కార్యాలయంలో బుధవారం పలువురు నివాళులర్పించారు. తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో సురేష్‌బాబు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు తన ప్రాణాలను సైతం అర్పించిన పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శం అని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమం జరిగి సమయంలో ఆమరణ నిరహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించడం వలన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర పై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

అద్దంకి రూరల్: రస్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలు సునీల్, వెంకటేశ్వర్లు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్తేరమ్మ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతం పబ్లిక్ హెల్త్ శానిటరీ వర్కర్లకు యూనిఫాం అందజేశారు. వైస్ చైర్మన్‌లు దేసుపద్మేష్, అనంతలక్ష్మి, వార్డు కౌన్సిలర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం విజయయాత్ర జరుపుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకొని భవిష్యత్ తరాలుకు మేలు జరగాలని చీరాలకు చెందిన అయినబోయిన మోషే విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. బుధవారం చెన్నుబొట్లవారిపాలెం, ఏదుబాడు, గన్నెపూడి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బిస్కెట్‌లు, పండ్లు పంపిణీ చేశారు. నలిగల కిషోర్ బాబు, గద్దె జాన్, సుమతి పాల్గొన్నారు.

జె. పంగులూరు: రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని ఎంపీడీవో బీ.రామాంజనేయులు అన్నారు. బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో అమరజీవి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పీఆర్ ఏఈఈ ఎస్‌వీఎస్ రామ్‌కుమార్, పీఆర్ అండ్ ఆర్డీ ఈవో బి. రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



పర్చూరు: విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న మోషే



అద్దంకి: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్



కుంకలమర్రులో అమరజీవికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మార్టూరు: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



ఇంకొల్లులో పొట్టి శ్రీరాములు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జగనన్న రుణం తీర్చుకునే సమయం ఇదే..

చినగంజాం: వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం జగనన్న రుణం తీర్చుకునే సమయం వచ్చిందని వలంటీర్‌లు అందుకు సంసిద్ధులు కావాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. సచివాలయాల పరిధిలో ప్రభుత్వం నిర్వహించనున్న గ్రామదర్శిని కార్యక్రమంపై బుధవారం కొత్తపాలెం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ఎం. బాబురావు అధ్యక్షతన మాట్లాడారు. సీఎం మానస పుత్రిక వలంటీర్ వ్యవస్థ ద్వారా వలంటీర్‌లు ఆయా సచివాలయాల పరిధిలో వారికి కేటాయించిన సెక్టార్‌లలో అందరికీ లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తద్వారా జగనన్న రుణం తీర్చుకోవాలన్నారు. ఎంపీటీసీ మరపాల రాంబాబు, సచివాలయ సిబ్బంది సుబ్బారెడ్డి, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

యద్దనపూడి: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సిబ్బంది అవగాహన కల్పించాలని బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయ డీఎల్ఎం మోహన్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రకృతి వ్యవసాయ ఏటీఎం మోడల్‌ను సందర్శించేందుకు ఆయన మండలానికి విచ్చేశారు. యద్దనపూడిలో బొబ్బేపల్లి సోనియా ఏటీఎం మోడల్‌ను, గన్నవరం గ్రామంలో న్యూట్రీ గార్డెన్ మోడల్‌ను పరిశీలించారు. న్యూట్రీ గార్డెన్ నుంచి వారు పొందిన ఆదాయం, వ్యయాలు, అనుభవాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతపురం రెడ్డి రమేష్, మోడల్ మేకర్ నాగరాజు, అనూష, బి. సోనియా, పాపారావు హాజరయ్యారు.



ఏటీఎం మోడల్‌ను పరిశీలిస్తున్న డీఎల్ఎం మోహన్

ప్రజలకు అందుబాటులో ఉండాలి

వేటపాలెం: ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ విజయమమ్మ ఆదేశించారు. రామన్నపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్ఓ బుధవారం పరిశీలించారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. ప్రతి రోజూ వైద్యశాలకు ఎంత మంది రోగులు వస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో నమోదు చేసుకున్న రోగులకు సంబంధించి గ్రామాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వైద్యసూచనలు అందించాలని తెలిపారు. వైద్యాధికారి శాంసన్, బాలరాజు ఉన్నారు.



వైద్యసిబ్బంది తో సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ విజయమ్మ

సంప్రదాయాలు తెలుసుకోవాలి

అద్దంకి రూరల్: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలని శింగరకొండ దేవస్థాన కార్యనిర్వాహణాధికారి టి. సుభద్ర అన్నారు. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా పంగులూరు మండలం రామకూరు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం నుంచి వచ్చిన ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానంలో పూజలు నిర్వహించారు బాపట్ల జిల్లా సహాయ కమిషనర్ పానకాల రావు, ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర కుమార్, ఈవోలు కృష్ణారెడ్డి, చావా వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, దేవస్థాన అర్చకులు పాల్గొన్నారు.



ప్రచారరథాన్ని ప్రారంభిస్తున్న ఏసీ సుభద్ర

రేపు పంగులూరులో జగనన్నకు చెబుదాం

జె. పంగులూరు: బాపట్ల కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం పంగులూరులోని టీటీడీ కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో, తహసీల్దార్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఆర్జీల ద్వారా కలెక్టర్‌కు తెలియజేయవచ్చన్నారు.

లారీని ఢీ కొన్న మరో లారీ

- ఒకరికి గాయాలు



గాయపడిన డ్రైవర్

మేదరమెట్ల: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొన్న సంఘటన మేదరమెట్ల పైలాన్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు చెన్నై నుంచి విజయవాడకు వెళుతున్న లారీ కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల పైలాన్ సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి పైకి రాగానే లారీ నుంచి శబ్దం రావడంతో డ్రైవర్ లారీని ఆపి చెక్ చేసుకుంటున్నాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఆగి ఉన్న లారీని ఢీ కొంది. ఈ సమయంలో గుద్దిన లారీలో ఉన్న రెండో డ్రైవర్ నిద్రిస్తున్నాడు. దీంతో అతనికి తలకు, చేతులకు గాయాలు కాగా హైవే పోలీసులు గాయపడిన వ్యక్తిని స్థానిక వైద్యశాలకు తరలించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఇంకొల్లు (చినగంజాం): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తోందని మాజీ శాసన సభ్యుడు, నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. బుధవారం పావులూరు1 గ్రామ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను ఆయా కాలనీల వారు ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు. మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, ఎంపీపీ బండారు అనూష, సర్పంచ్ వల్లేటి ఉధియమ్మ, ఎంపీటీసీ చిట్టిబాబు, సొసైటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ తూమాటి చలమయ్య, మాజీ సర్పంచ్ బసిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామాంజమ్మ, సింహాద్రి సుబ్బారెడ్డి, గాదె వెంకారెడ్డి పాల్గొన్నారు.



ఆమంచిని ఆహ్వానిస్తున్న పావులూరు ప్రజలు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

చినగంజాం: రొయ్యల చెరువుల రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మత్స్య సహాయకురాలు కొమిరా ప్రమీల అన్నారు. బుధవారం మోటుపల్లిలో పలగాని విజయభాస్కర్‌రెడ్డి రొయ్యల చెరువులు వద్ద అవగాహన కలిగించారు. నీటి నాణ్యత పరీక్ష కోసం మత్స్యశాఖ వారు ఏర్పాటు చేసిన దేశాయిపేటలో ఆక్వా ల్యాబ్ గురించి మాట్లాడారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం ఆశ్వీజ మాసం ఆరుద్ర నక్షత్రం పంచమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

చెరువు కట్ట పనుల పరిశీలన

అద్దంకి రూరల్: పట్టణంలోని ఊరచెరువుపై ఉన్న కట్టపై చేపడుతున్న అభివృద్ధి పనులను బుధవారం రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పరిశీలించారు. వార్డు కౌన్సిలర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

నాభూమి.. నా దేశం

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో బుధవారం ఎన్‌వైకేఎస్ గుంటూరు జిల్లా యూత్ ఆఫీసర్ దేవిరెడ్డి కిరణ్మయి ఆదేశాల మేరకు నాభూమి – నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ సి.హెచ్ రమణమ్మ మాట్లాడుతూ ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వలంటీర్ నీలం మీనాక్షి పాల్గొన్నారు.

మాలధారులకు రేపటి నుంచి సద్ది వితరణ

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు బలరాం కాలనీలోని శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో నవంబర్ 3వ తేదీ నుంచి 40 రోజులపాటు అయ్యప్ప మాలధారులకు మధ్యాహ్నం సద్ది ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ చైర్మన్ సకల ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప భక్తులు అవకాశాన్ని వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడులు

కారంచేడు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా అన్నదాతలు ఎంతో మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మాస్టర్ ట్రైనర్ సీహెచ్ అప్పారావు అన్నారు. బుధవారం కారంచేడుతో పాటు, కుంకలమర్రు, స్వర్ణ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ భూమిలో అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ ప్రాంతంలోని వరిలో కాండం తొలుచు పురుగు, గుడ్డు పెట్టే రెక్కల పురుగులను గమనించామన్నారు. దీని నివారణ ప్రధానంగా రైతులు లింగాకర్ష బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎకరాకి కనీసం 8 చొప్పున ఏర్పాటు చేయాలన్నారు. అగ్నాస్త్రం కషాయం తయారు చేసే విధానం తెలిపారు. ఎల్2 వసంత శిరీష, ఐసీపీఆర్‌లు, రైతులు పాల్గొన్నారు.